


VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ సంపుటి : 01 సంచిక : 109 ఆదివారం 20 సెప్టెంబర్ 2026 పేజీలు : 8 వెల : 2/-



# విశాఖలో ‘పేదలకు పట్టాభిషేకం’

## లబ్ధిదారులకు ఆస్తి హక్కు పత్రాలు అందించిన సీఎం చంద్రబాబు

- విశాఖలో ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమం
- 28,445 కుటుంబాలకు ఇంటి పట్టాలు పంపిణీ
- పేదల ఇళ్ల కోసం 399 ఎకరాల భూమి క్రమబద్ధీకరణ
- పట్టాలు అందించి ర్యాంప్ వాక్‌తో అలరించిన సీఎం చంద్రబాబు
- పంపిణీ చేసిన ఆస్తుల విలువ రూ.8,874 కోట్లు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విశాఖపట్నంలో ‘పేదలకు పట్టాభిషేకం’ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. మిగతా2లో




# ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

### లోకేశ్ నివాసంలో ఇంటర్ బోర్డు పాలకవర్గం సమావేశం

### 1978 నుంచి జారీ చేసిన ఇంటర్ సర్టిఫికెట్లను డిజిటలైజ్ చేయాలని నిర్ణయం

### ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 60 నుంచి 62కి పెంచాలని తీర్మానం

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవా బుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవి ధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర మిగతా2లో






# మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

- కొప్పర్తి-కడప బైపాస్ రహదారికి రూ. 304 కోట్లు కేటాయించిన కేంద్రం
- రాష్ట్రాభివృద్ధికి కేంద్రం ఎంతో సహకరిస్తోందన్న పవన్ కల్యాణ్
- ఈ ప్రాజెక్టు కారణంగా రాయలసీమలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని వెల్లడి

కడప జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ ను కడప బైపాస్‌తో అనుసంధానించే నూతన రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు మంజూరుతో పాటు రూ.304.44 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా -మిగతా2లో


2

# బ్రిక్స్ సదస్సుతో ప్రపంచ వేదికపై భారత్ స్థానం మరింత బలోపేతం!

- బ్రిక్స్ సదస్సు నిర్వహణలో భారత దౌత్యంపై డైరెక్టస్ ప్రత్యేక నివేదిక
- పహల్గామ్ ఉగ్రదాడిని ఖండించడంతో భారత వాదనలకు లభించిన మద్దతు
- క్వాడ్‌లో ఉంటూనే బ్రిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు ‘డైరెక్టస్’ ప్రస్తావన
- అమెరికాతో సంబంధాలు కొనసాగిస్తూ రష్యాతో భాగస్వామ్యం కీలకమని వ్యాఖ్య

# స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం

ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనేది ముఖ్యం కాదన్న మనోహర్

కచ్చితంగా విజయం సాధించే స్థానాల్లో పోటీ చేయడమే ముఖ్యమని వ్యాఖ్య

పవన్ కల్యాణ్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నారని వెల్లడి



రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు.



# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

- 20వ రోజ్‌గార్ మేళాలో 51,000 మందికి పైగా నియామక పత్రాల పంపిణీ
- భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరణ
- చిన్న నగరాల్లోనూ స్టార్టప్‌లు వస్తుండటం శుభపరిణామం అన్న ప్రధాని
- రూ. లక్ష కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన ప్రారంభం
- కొత్తగా చేరిన ఉద్యోగులకు నిరంతర అభ్యాసంపై ప్రధాని మోదీ సూచన

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యా వరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నా రు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన మిగతా2లో

# తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారనే విషప్రచారాన్ని ఆపండి



### వైసీపీ హయాంలో లడ్డూ కల్తీ వార్తలను ఖండించిన రోజా

### భక్తుల మనోభావాలతో ఆడుకోవద్దని వ్యాఖ్య

### జంతువుల కొవ్వు కలిసిందని చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శ

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీపై సాగుతున్న ప్రచారాన్ని ఖండి స్తూ వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్వామివారి ప్రసాదాలు అత్యంత పవిత్రమైనవని... కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కోట్లమంది భక్తుల నమ్మకాలతో, భావోద్వేగాలతో ఆడుకోవడాన్ని కూటమి నేతలు తక్షణమే కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ నిజమేంటో స్పష్టంగా బయటపడిందని పేర్కొన్న రోజా.. జగన్ హయాంలో కల్తీ జరిగిందంటూ వైసీపీపై చేస్తున్న విషప్రచారానికి స్వస్తి పలకాలన్నారు. జగన్ పాలన పచ్చి పాలు లాంటిదని, అక్కడ కల్తీకి ఎంతమాత్రం మిగతా2లో

VARTHAA SAKSHAMU
వార్త
Editor : SAGINALA RAVI KUMAR
తెలుగు దిన పత్రిక



# విశాఖలో 'పేదలకు పట్టాభిషేకం'..

ఈ సందర్భంగా వేలాది నిరుపేద కుటుంబాలకు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న ఇంటి స్థలాల పట్టాలను (ఆస్తి హక్కు పత్రాలు) ఆయన స్వయంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా నగరంలోని 28,445 కుటుంబాలకు వారి సొంతింటి కల సాకారమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల ఇళ్ల స్థలాల కోసం 399 ఎకరాల భూమిని క్రమబద్ధీకరించింది. ఈ క్రమబద్ధీకరించిన స్థలాలకు సంబంధించిన పట్టాలను లబ్ధిదారులకు అందించారు. పంపిణీ చేసిన ఈ ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8,874 కోట్లు ఉంటుందని అంచనా. ఈ కార్యక్రమం నగరంలో పండగ వాతావరణాన్ని తలపించింది. అంతకుముందు, ఇవాళ విశాఖపట్నం చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికారు. పట్టాల పంపిణీ కార్యక్రమం అనంతరం చంద్రబాబు లబ్ధిదారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. వేదికపై ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై నడుస్తూ ఆయన లబ్ధిదారులను, సభకు హాజరైన వారిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పాటు పలువురు కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు. దశాబ్దాలుగా ఉన్న తమ సమస్యకు పరిష్కారం లభించడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

# అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించండి

రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను శాస్త్రీయంగా అంచనా వేసి, అక్టోబర్ 1న కరవు మండలాలను అధికారికంగా ప్రకటించాలని ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఎక్కడా పంట నష్టం జరగకుండా, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పటిష్ఠమైన ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. కరవు పరిస్థితులపై ప్రతీ నెలా కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు పంపించాలని నిర్దేశించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయ-ఉద్యాన పంటల పరిస్థితి, రైతుల ఇబ్బందులు, తాగునీటి సరఫరా తదితర అంశాలపై శనివారం తన క్యాంపు కార్యాలయంలో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. కరువు మండలాల గుర్తింపు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉండాలని సీఎం స్పష్టం చేశారు. వర్షపాతం, పంటల సాగు, భూగర్భ జలాలు, నేలలో తేమ శాతం, ఉపగ్రహ చిత్రాలు, జలాశయాల్లో నీటి నిల్వలు వంటి ఆరు కీలక అంశాలను సమగ్రంగా విశ్లేషించి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

**513 మండలాల్లో కరవు ఛాయలు**

2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో ప్రాథమిక అంచనాల ప్రకారం మొత్తం 513 మండలాల్లో కరవు ఛాయలు అలుముకున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వీటిలో 268 మండలాల్లో తీవ్రమైన వర్షాభావం, 245 మం డలాల్లో మోస్తరు వర్షాభావం నెలకొందని తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనను వ్యవసాయ శాఖ చేపడుతుం దని, జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు పంట, దిగుబడి నష్టాన్ని అంచనా వేస్తాయ ని చెప్పా రు. ఈ నివేదికలను కలెక్టర్లు సెప్టెంబర్ 24లోగా రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖకు సమర్పించాల్సి ఉంటుందన్నారు. సెప్టెంబర్ 29న జరిగే రాష్ట్ర స్థాయి కమిటీ సమావేశంలో ఈ ప్రతిపాద నలను పరిశీలించి, తుది జాబితాను సిద్ధం చేస్తామని అధికా రులు వెల్లడించారు.

**ఉద్యాన పంటల రక్షణ, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత**

వర్షాభావ పరిస్థితులతో పాటు ఎల్‌నినో ప్రభావం వల్ల ఉద్యాన పంటలు ప్రమాదంలో ఉన్నాయని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు. రాష్ట్రంలోని 21 జిల్లాల్లో 1,357 రైతు భరోసా కేంద్రాల పరిధిలోని పంటలు 'హై రిస్క్' కేటగిరీలో ఉన్నాయని, సుమారు 17,916 హెక్టార్లలో నారింజ, బత్తాయి, మామిడి, మిరప, ఉల్లి వంటి పంటలు ప్రభావితం కానున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, ఉద్యాన పంటలను కాపాడేందుకు ఇప్పటికే రూ.190 కోట్లు కేటాయించామని, వాటికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నీటి లభ్యత తగ్గుతున్న నేపథ్యంలో తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణాన్ని కాపాడేందుకు సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) వైపు రైతులను ప్రోత్సహించాలని నిర్దేశించారు. ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ సేవలను 'మన మిత్ర' వాట్సప్ గవర్నెన్స్ ద్వారా రైతులకు అందుబాటులోకి తేవడాన్ని ప్రశంసించారు. సూక్ష్మ సేద్యంతో పాటు ప్రకృతి సేద్యం వైపు రైతులను మళ్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# బ్రిక్స్ సదస్సుతో ప్రపంచ వేదికపై భారత్ స్థానం మరింత బలోపేతం!

న్యూఢిల్లీ వేదికగా జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత అంతర్జాతీయ వేదికపై భారత్‌కు దౌత్యపరమైన ప్రాధాన్యం మరింత స్పష్టమైందని 'డైరెక్టస్' నివేదిక పేర్కొంది. ముఖ్యంగా 2025 పహల్గామ్ ఉగ్రదాడిని బ్రిక్స్ న్యూఢిల్లీ డిక్లరేషన్‌లో తీవ్రంగా ఖండించడం, సరిహద్దు దాటి ఉగ్రవాదుల కదలికలు, ఉగ్రవాదానికి నిధులు, సురక్షిత స్థావరాలకు వ్యతిరేకంగా స్పష్టమైన వైఖరి తీసుకోవడం భారత్ చాలాకాలంగా ప్రస్తావిస్తున్న అంశాలకు మద్దతు లభించినట్లయిందని తెలిపింది. పహల్గామ్ దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రవాదాన్ని ఏ రూపంలో ఉన్నా నేరపూరిత మైనదిగా, సమర్థించలేనిదిగా పేర్కొన్నాయి. ఉగ్రవాద చర్యలకు పాల్పడినవారితో పాటు వారికి మద్దతు ఇచ్చేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూడా డిక్లరేషన్ స్పష్టం చేసింది. అయితే డిక్లరేషన్‌లో పాకిస్థాన్ పేరును నేరుగా ప్రస్తావించలేదు. ఈ అంశాన్ని దాచాల్సిన అవసరం లేదని, అదే సమయంలో అతిగా ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం కూడా లేదని 'డైరెక్టస్' పేర్కొంది. వివిధ భౌగోళిక, రాజకీయ ప్రయోజనాలు ఉన్న దేశాలు కలిసి ఉగ్రవాదంపై ఇలాంటి భాషను అంగీకరించడం భారత్‌కు దౌత్యపరంగా ముఖ్యమైన పరిణామమని విశ్లేషించింది. ఉగ్రవాదాన్ని కేవలం దాడి చేసిన వ్యక్తితో మాత్రమే పరిమితం చేయలేమని నివేదిక పేర్కొంది. ఆయుధాలు, శిక్షణ, నిధులు, సమాచార వ్యవస్థలు, నియామక నెట్‌వర్క్‌లు, సురక్షిత ప్రాంతాల వంటి మొత్తం వ్యవస్థపై చర్యలు అవసరమని తెలిపింది. ఈ అంశాలపై బ్రిక్స్ డిక్లరేషన్‌లో వచ్చిన ప్రస్తావన ప్రాధాన్యమైనదని పేర్కొంది. అదే సమయంలో భారత్ అనుసరిస్తున్న బహుముఖ విదేశాంగ విధానాన్ని కూడా నివేదిక ప్రస్తావించింది. అమెరికాతో సంబంధాలను విస్తరిస్తూనే రష్యాతో భాగస్వామ్యాన్ని భారత్ కొనసాగిస్తోంది. క్వాడ్‌లో సభ్యత్వంతో పాటు బ్రిక్స్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. చైనాతో విభేదాలు ఉన్నప్పటికీ.. జాతీయ ప్రయోజనాలకు అవసరమైన చోట ఆ దేశంతో చర్చలు కొనసాగిస్తోంది. వివిధ దేశాల మధ్య భిన్నమైన అభిప్రాయాలు ఉన్నప్పటికీ.. భారత్ తన భద్రతకు సంబంధించిన అంశాలను బ్రిక్స్ వంటి వేదికపై చర్చకు తీసుకురాగలిగిందని 'డైరెక్టస్' విశ్లేషించింది. దీనివల్ల ఏ ఒక్క భౌగోళిక రాజకీయ కూటమిపై ఆధారపడకుండా స్వతంత్రంగా వ్యవహరించే దేశంగా భారత్ తన దౌత్యపరమైన స్థాయిని మరింత స్పష్టంగా చూపించిందని నివేదిక పేర్కొంది.

# భారత యువత సత్తాకు స్టార్టప్‌లే నిదర్శనం

దేశ యువత సామర్థ్యానికి, వారి సత్తాకు దేశంలోని స్టార్టప్ పర్యావరణ వ్యవస్థే ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఒకప్పుడు కేవలం పెద్ద నగరాలకే పరిమితమైన స్టార్టప్‌ల కథ ఇప్పుడు చిన్న పట్టణాలకు, నగరాలకు కూడా విస్తరించిందని ఆయన పేర్కొన్నారు. 20వ రోజ్‌గార్ మేళా సందర్భంగా శనివారం ఆయన వివిధ ప్రభుత్వ సంస్థలకు కొత్తగా ఎంపికైన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల నుంచి 51,000 మందికి పైగా యువతకు నియామక పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. "భారతదేశం నేడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా నిలిచింది. గుర్తించబడిన స్టార్టప్‌లలో దాదాపు సగం టైర్-2, టైర్-3 నగరాల్లోనే ఉన్నాయి. ఇది భారతదేశ నూతన ఆర్థిక వ్యవస్థలో గ్రామాలు, పట్టణాలు, చిన్న నగరాల నుంచి వచ్చిన యువత కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని చూపిస్తోంది" అని వివరించారు. చిన్న పట్టణాలకు చెందిన యువత తమ సొంత ఆలోచనలతో కొత్త కంపెనీలను స్థాపిస్తూ, తమతో పాటు ఇతర యువతకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తున్నారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగంతో పాటు ప్రైవేటు రంగంలోనూ ఉపాధి అవకాశాలను వేగంగా విస్తరించేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని మోదీ స్పష్టం చేశారు. "ఈ లక్ష్యంతోనే సుమారు రూ. 1 లక్ష కోట్లతో 'ప్రధాన మంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన'ను ప్రారంభించాం. ఈ పథకం ద్వారా దాదాపు 2 కోట్ల మంది యువత తొలిసారిగా ఉద్యోగ రంగంలోకి ప్రవేశించే అవకాశం లభిస్తుంది. మొదటిసారి ఉద్యోగంలో చేరేవారికి రూ. 15,000 వరకు ప్రోత్సాహకం అందించడంతో పాటు, కొత్త ఉద్యోగాలను సృష్టించే యాజమాన్యాలకు కూడా ప్రోత్సాహకాలు ఉంటాయి" అని తెలిపారు. ప్రభుత్వ వ్యవస్థలో భాగం కాబోతున్న నూతన ఉద్యోగులకు ప్రధాని కీలక సూచనలు చేశారు. "మీరు, మీ తల్లిదండ్రులు ఎదుర్కొన్న ఇబ్బందులు, కష్టాలు దేశంలోని ఏ పౌరుడూ ఎదుర్కోకుండా చూడటమే మీ లక్ష్యం కావాలి. ప్రభుత్వ సేవలో చేరిన వెంటనే ఈ మిషన్‌ను మీరు చేపట్టాలి" అని పిలుపునిచ్చారు. నిరంతరం నేర్చుకోవడం, కొత్త నైపుణ్యాలు, టెక్నాలజీని అందిపుచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆయన అన్నారు. ఇందుకోసం 'మిషన్ కర్మయోగి'ని రూపొందించినట్లు తెలిపారు. ఇప్పటికే 1.70 కోట్ల మంది ప్రభుత్వ ఉద్యోగులు 'ఐ+గాట కర్మయోగి' ప్లాట్‌ఫామ్‌లో చేరారని, కొత్తగా చేరే వారి కోసం 'కర్మయోగి ప్రారంభ్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని సిద్ధం చేశామని వివరించారు. మీరు మిమ్మల్ని ఎంతగా మెరుగుపరుచుకుంటే, దేశ పౌరులకు అంత మెరుగైన సేవలు అందించగలరని ప్రధాని పేర్కొన్నారు.

## ఇంటర్ బోర్డులో డిజిటలైజేషన్, రిటైర్మెంట్ వయోపరిమితి పెంపు

ఆంధ్రప్రదేశ్ ఇంటర్మీడియట్ విద్యారంగంలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా వైవిధ్యమైన సంస్కరణలకు తెరలేపారు. ఉండవల్లిలోని తన నివాసంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అధ్యక్షతన జరిగిన ఇంటర్ బోర్డు 78వ పాలకవర్గ సమావేశంలో విద్యార్థుల భవిష్యత్తుతో పాటు ఉద్యోగుల సంక్షేమాన్ని పరిగణనలోకి తీసుకుంటూ అనేక కీలక నిర్ణయాలకు ఆమోద ముద్ర వేశారు. నకిలీ సర్టిఫికెట్ల అక్రమాలకు శాశ్వతంగా ముగింపు పలకాలనే దృఢ సంకల్పంతో 1978 నుంచి జారీ చేసిన ఇంటర్మీడియట్ విద్యార్హత పత్రాలన్నింటినీ సమగ్రంగా డిజిటలైజ్ చేయాలని ప్రతిపాదించారు. భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు ఈ రికార్డులను అత్యాధునిక 'బ్లాక్‌చైన్ టెక్నాలజీ'తో అనుసంధానించనున్నారు. విద్యా పునర్నిర్మాణంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి తీపి కబురు అందిస్తూ వారి పదవీ విరమణ వయోపరిమితిని 60 సంవత్సరాల నుంచి 62 ఏళ్లకు పెంచుతూ తుది తీర్మానం చేశారు. దీనికితోడు పరీక్షల నిర్వహణ ప్రక్రియను వేగవంతం చేసే క్రమంలో ఇన్విజిలేటర్లు, మూల్యాంకనదారుల శ్రమను గుర్తించి వారు అందుకునే భత్యాలను ఏకంగా 25 శాతం వరకు పెంచే ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు. పరీక్షల్లో విద్యార్థుల సౌకర్యార్థం థియరీ సబ్జెక్టులకు 32 పేజీల బుక్‌లెట్లను అందించనున్నారు. మూల్యాంకనంలో ఏమాత్రం అలసత్వం వహించినా లేదా తీవ్రమైన తప్పులకు పాల్పడినా సంబంధిత సిబ్బందిపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.

## మోదీ, గడ్కరీలకు ధన్యవాదాలు తెలిపిన పవన్ కల్యాణ్

కడప జిల్లాలోని కొప్పర్తి ఇండస్ట్రియల్ కారిడార్ ను కడప బైపాస్‌తో అనుసంధానించే నూతన రహదారి నిర్మాణ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ ప్రాజెక్టు మంజూరుతో పాటు రూ. 304.44 కోట్ల నిధులను కేటాయించినట్లు కేంద్ర రహదారులు, ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ అధికారికంగా ప్రకటించారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రధానమంత్రి మోదీకి, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర మౌలిక వసతుల కల్పనకు, పారిశ్రామిక పురోగతికి కేంద్ర ప్రభుత్వం నిరంతరం అందిస్తున్న సహకారం అభినందనీయమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖపట్నం-చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో కొప్పర్తి అత్యంత కీలకమైన నోడ్‌గా ఉందన్న ఆయన... కొత్తగా నిర్మించే అనుసంధాన రహదారి అందుబాటులోకి వస్తే పారిశ్రామిక సరుకు రవాణా మరింత వేగవంతం, సులభతరం అవుతుందని వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ఫలితంగా రాయలసీమ ప్రాంతంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో పాటు, భారీ స్థాయిలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు, వాణిజ్య కార్యకలాపాలు పెరిగి రాయలసీమ ముఖచిత్రం మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## స్థానిక ఎన్నికల్లో కూటమిదే విజయం.. 100 శాతం స్ట్రైక్ రేట్ ఖాయం

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగిస్తుందని, వందకు వంద శాతం స్ట్రైక్ రేట్‌తో విజయాలు సాధిస్తామని ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ ధీమా వ్యక్తం చేశారు. విశాఖపట్నంలో ఈరోజు పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై మాట్లాడారు. అభ్యర్థుల ఎంపికలో ఏవైనా పొరపాట్లు లేదా సమస్యలు ఎదురైతే వెంటనే పార్టీ అధిష్ఠానం దృష్టికి తీసుకురావాలని సూచిస్తూ, స్థానిక వార్డుల వారీగా బలమైన నాయకత్వాన్ని సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని సీట్లలో పోటీ చేస్తున్నామనే సంఖ్య కంటే, గెలిచే బలం ఉన్న స్థానాల్లో నిలబడి కచ్చితమైన విజయం సాధించడమే ప్రాధాన్యమని స్పష్టం చేశారు. జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఇవాళ్టి నుంచి పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి రానున్నారని నాదెండ్ల మనోహర్ వెల్లడించారు. రాజకీయాల్లో అనుభవమే అసలైన పాఠమని పేర్కొంటూ, జీవీఎంసీ పరిధిలో గతంలో గెలిచిన, రెండో స్థానంలో నిలిచిన ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కేవలం టికెట్ వస్తే సరిపోదని... ప్రజల అవసరాలు, స్థానిక సమస్యల పరిష్కారం కోసం కేడర్ నిరంతరం శ్రమించాలని నిర్దేశించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఐక్యత వల్లే రాష్ట్రంలో పెట్టుబడిదారులకు కొండంత భరోసా లభించిందని, ఉత్తరాంధ్రకు వస్తున్న భారీ ప్రాజెక్టులే దీనికి నిదర్శనమని చెప్పారు. జనసేన పార్టీ ఎల్లప్పుడూ ప్రజల ప్రయోజనాల కోసమే పనిచేస్తుందని తెలిపారు.

## తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి కలిపారనే విషప్రచారాన్ని ఆపండి: రోజా

తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీపై సాగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సామాజిక మాధ్యమాల వేదికగా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. స్వామివారి ప్రసాదాలు అత్యంత పవిత్రమైనవని... కేవలం రాజకీయ లబ్ధి పొందాలనే దురుద్దేశంతో కోట్లమంది భక్తుల నమ్మకాలతో, భావోద్వేగాలతో ఆడుకోవడాన్ని కూటమి నేతలు తక్షణమే కట్టిపెట్టాలని డిమాండ్ చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల వేళ నిజమేంటో స్పష్టంగా బయటపడిందని పేర్కొన్న రోజా... జగన్ హయాంలో కల్తీ జరిగిందంటూ వైసీపీపై చేస్తున్న విషప్రచారానికి స్వస్తి పలకాలన్నారు. జగన్ పాలన పచ్చిపాలు లాంటిదని, అక్కడ కల్తీకి ఎంతమాత్రం ఆస్కారం లేదని అన్నారు. నాణ్యతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉన్న నెయ్యి ట్యాంకర్లను టీటీడీ బోర్డు తనిఖీల్లోనే తిరస్కరించి వెనక్కి పంపినప్పుడు, ఆ నెయ్యి ప్రసాదాల్లో కలవలేదని స్పష్టమవుతున్నా, జంతువుల కొవ్వు కలిసిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు అసత్య ప్రచారం చేయడం భక్తుల మనోభావాలను తీవ్రంగా గాయపరచడమేనని రోజా తన పోస్ట్‌లో నిలదీశారు.



## విశాఖ బీచ్‌లో మిక్చర్ రుచి చూసిన చంద్రబాబు

VARTHAA SAKSHAMU
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# సంపాదకీయం

## కమ్యూనిస్టులు ఏకమవ్వాల్సిన వేళ ఇది!



ప్రపంచ దేశాలపై అమెరికా పెత్తనం బీటలు వారుతోంది. ఏ దేశానికీ లేనంత భారీ అప్పు (40 ట్రిలియన్ డాలర్ల)లో కూరుకుపోయింది. డాలర్ ఆధిపత్యానికి స్థానిక దేశీయ క్రాస్ బోర్డర్ కరెన్సీలతో గండి కొట్టాలని బ్రిక్స్ దేశాల కూటమి నిర్ణయించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న ఎడతెగని యుద్ధంతో హోర్ముజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ఉక్రెయిన్--రష్యా యుద్ధానికి తోడు, యెమెన్‌కు చెందిన హౌతీలు సౌదీ అరేబియా ఆయిల్ కంపెనీలు, పైప్‌లైన్‌లపై నిర్వహిస్తున్న దాడులు ప్రపంచ ఇంధన సమస్యలను మరింత సంక్లిష్టం చేస్తున్నాయి. ఎర్ర సముద్రాన్ని, హిందూ మహా సముద్రంతో అనుసంధానించే 'బాబ్--ఎల్--మండేబ్ జలసంధి'పై హౌతీ తిరుగుబాటుదారులు పట్టు బిగించారు. తత్ఫలితంగా చమురు రవాణాకు అత్యంత కీలకమైన మరో జలసంధిలో కూడా నౌకల రాకపోకలకు ప్రతికూల పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చమురు బ్యారెల్ ధర 110 డాలర్లకు పెరిగింది. ఆధునిక ఆర్థిక కార్యకలాపాలకు జీవనాడి అయిన ఇంధన సరఫరా స్తంభించిపోయింది. ప్రపంచవ్యాప్తంగా నిత్యావసరాల ధరలు భరించలేని స్థాయికి పెరిగిపోయాయి. డోనాల్డ్ ట్రంప్ పదే పదే విధిస్తున్న ఆంక్షలు, పన్నులతో అన్ని దేశాలు తీవ్ర ఆర్థిక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఇంధన సమస్యలు, సప్లై చైన్స్ విచ్ఛిన్నం, కంపెనీల మూత, వడ్డీ రేట్లు, ధరల పెరుగుదల, జీవనోపాధుల విధ్వంసం, నిలిచిపోయిన ఎరువుల సరఫరా మొదలైన సమస్యలు సకల దేశాల ఆర్థిక వ్యవస్థలను కుదిపేస్తున్నాయి. రష్యా నుంచి చౌక ధరలకు ఆయిల్ కొనుగోలు చేస్తున్న భారత్ సహా ఐదు దేశాలపై అమెరికా 100శాతం పన్నులు విధిస్తూ ఒక చట్టాన్ని తీసుకువచ్చింది. ఆయా దేశాలలోని వందల కోట్ల ప్రజలకు చౌక ఇంధనం లేకుండా చేయడమే ట్రంప్ లక్ష్యం. మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. అమెరికా చర్యలను చైనా తీవ్రంగా ఖండించింది. ట్రంప్ దీర్ఘకాలంగా అనేక రూపాల్లో భారత ప్రజలపై కత్తిగట్టారు. అయినా స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలతో విదేశీ వ్యాపారంలో మోదీ ప్రభుత్వం అమెరికాకు లొంగిపోతోంది.నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్వేషాలను రెచ్చగొట్టి ప్రజలలో చీలికలు సృష్టించింది. బడా సంపన్నులను వదిలి, సామాన్య మధ్య తరగతి కష్టార్జితాలను దోచేస్తున్నారు. ప్రతి వినియోగదారుడు యూపీఐ డిజిటల్ చెల్లింపుల బాధితుడవుతున్నాడు. జీఎస్టీ దోపిడీకి ఇది అదనం. బడా సంపన్నుల 18.50 లక్షల కోట్ల రూపాయల రుణాలను మోదీ సర్కార్ మాఫీ చేసింది. ప్రభుత్వ బ్యాంకుల నుంచి సుభాష్ చంద్ర తీసుకున్న రూ.20,206.54 కోట్ల రుణంలో 6.5 కోట్లు మాత్రమే చెల్లించమని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ చెప్పింది. రూ.20,200 కోట్ల రుణం మాఫీ చేసింది. రుణదాతలు పైకోర్టుకు వెళ్లారు. పేదవాళ్లు తీసుకున్న రుణాలను ముక్కుపిండి వసూలు చేసే బ్యాంకులు... పెద్దలకు ఎందుకు మాఫీ చేస్తున్నాయి? జాతీయ, ప్రాంతీయ పార్టీలు బడా సంపన్నుల సేవకు పరిమితమవుతున్నాయి. ఆయా పార్టీల ప్రభుత్వాల అవినీతి భరించలేని స్థాయికి చేరింది. ప్రజాతంత్ర శక్తులు, కమ్యూనిస్టులు ఐక్యవేదికపై పనిచేయాల్సిన అనివార్యత ఏర్పడింది. ప్రపంచ పరిణామాలు దీనిని బలపరుస్తున్నాయి.బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, బుర్కినో ఫాసో, నైజర్, మాలి లాంటి అనేక దేశాలలో 'జెన్ జీ' తిరుగుబాట్లతో ప్రభుత్వాలు తుడిచిపెట్టుకుపోయాయి. ప్రపంచ గమనం ఎప్పుడూ లేనంత శరవేగంగా మారుతోంది. ఇటీవలి విద్యార్థి జెన్ జీ ఉద్యమం, ఇతర రాష్ట్రాలకు వ్యాపించిన తీరు యువతలో రగులుతున్న ఆందోళనను వెల్లడిస్తున్నది. ప్రస్తుత విద్యా విధానంలో, పరీక్షల్లో చోటుచేసుకుంటున్న అవకతవకలపై విద్యార్థి, యువజనలోకం తీవ్ర ఆగ్రహంతో ఉంది. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల హామీ గాలికి పోయింది. ఉద్యోగాల్లో కోత యువతను వణికిస్తోంది. నిరుద్యోగం ఎల్లెడలా తాండవిస్తోంది. రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తామనే వాగ్దానం నెరవేర్చడంపై మోదీ ప్రభుత్వం శ్రద్ధ చూపడం లేదు. రైతులోకం సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది. ఈశాన్య భారతంలోని మణిపూర్ రెండున్నరేళ్లుగా జాతుల ఘర్షణతో మండిపోతోంది. విద్య, వైద్యం భారీ వ్యాపారాలయ్యాయి. కృత్రిమ మేధ తదితర అధునాతన సాంకేతికతల మూలంగా లక్షల ఉద్యోగాలు ఊడుతున్నాయి. మనుషులు లేకుండా, రోబోలతో నడిచే అత్యాధునిక హైటెక్ పరిశ్రమలుగా నేటి ఆధునిక పరిశ్రమలు పరిణమించాయి. మానవ నైపుణ్యాన్ని, పనిలో మనిషి అవసరాన్ని ఉత్పత్తిలో, పంపిణీలో చాలా వేగంగా తొలగించే స్థాయికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చేరుతోంది. మోదీ సర్కార్ ప్రారంభించిన 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమం 'పేరు గొప్ప.. ఫలితం దిబ్బ'గా మారింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలు, బ్యాంకులు ఇతర సంస్థలలో పనిచేసే వారి ఉద్యోగాలకు అధునాతన సాంకేతికతలతో తీవ్ర ముప్పు ఏర్పడింది. కొత్త ఉద్యోగాల సృష్టి ఆగిపోయింది.ఉన్న ఉద్యోగాలను తగ్గించడం ఎలా అనేదే నేటి లక్ష్యంగా మారింది.సమీప భవిష్యత్తులోనే లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోతారనీ అంతర్జాతీయ నివేదికలు వెల్లడిస్తున్నాయి.

# కాళీపట్నం భూముల సర్వే అనంతరం యాజమాన్య హక్కు పత్రాల సేకరణపై సిబ్బందికి అవగాహన

**-భూ యజమానులు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రక్రియను పూర్తి చేయాలి....**

**-జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ...**

కాళీపట్నం సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం;





చాలా సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్లు లేకుండా రైతుల స్వాధీనంలో ఉన్న భూములకు సంబంధించి సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపడుతోందని జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ తెలిపారు. మొగల్తూరు మండలం, కాళీపట్నం గ్రామంలోని సర్వే చేసిన భూములకు సంబంధించిన పత్రాల సేకరణ, పరిశీలన విధానాలపై జిల్లోని డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, ఇతర సంబంధిత సిబ్బందికి శనివారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భ ంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ఎస్టేట్స్ అబాలిషన్ చట్టం, 1948 అమలులో భాగంగా మొగల్తూరు మండలం, కాళీపట్నం గ్రామంలో సర్వే చేసిన భూములకు సంబంధించి యాజమాన్యాన్ని నిరూపించే హక్కు పత్రాల సేకరణ, పరిశీలన ప్రక్రియను పూర్తి పారదర్శకతతో, నిబంధనలకు అనుగుణంగా, ఎటువంటి వివాదాలకు తావులేకుండా, సానుకూల వాతావరణంలో నిర్వహిం చాలని అధికారులను ఆదేశించారు. ప్రతి భూమికి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, అందుబాటులో ఉన్న ఆధారాల ఆధారంగానే వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. భూముల వాస్తవ అనుభవం, స్వాధీనం, అందు బాటులో ఉన్న రెవెన్యూ రికార్డులు, ఇతర సంబంధిత ఆధారాలను సమగ్రంగా పరిశీలించాలని సూచిం చారు. ప్రతి అంశాన్ని నిబంధనల ప్రకారం పరిశీలి స్తూ, భూ యజమానులు, రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. భూములకు సంబంధించిన హక్కులను నిర్ధారించే ప్రక్రియలో భూ యజమానులు, రైతులు కూడా అధికారులకు పూర్తి సహకారం అందించాలని తెలిపారు. సర్వే చేసిన భూములకు సంబంధించి తమ వద్ద ఉన్న రైతు పట్టా, రిజిస్టర్ పట్టా, లింక్ డాక్యుమెంట్లు, ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, లీగల్ హెయిర్ సర్టిఫికెట్ తదితర సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.సంబంధిత పత్రాలను అధికారులు పరిశీలించిన అనంతరం, భూముల వాస్తవ పరిస్థితి, అందుబాటులో ఉన్న రెవెన్యూ రికార్డు లు, ఇతర ఆధారాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత నివేదికలను ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. అనం తరం ప్రభుత్వం ఇచ్చే సూచనల మేరకు తదుపరి చర్యలు చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. డాక్యుమెంట్ల సేకరణకు కేటాయించిన సిబ్బంది గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ, ప్రక్రియపై ఉన్న సందేహాలను నివృత్తి చేయాలని సూచించారు. పత్రాల సేకరణ, పరిశీలనలో రైతులకు పూర్తి అవగాహన కల్పిస్తూ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత పత్రాల పరిశీలన తదితర అంశాల్లో అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేయాలని, నిర్ణీత విధానాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. చాలా కాలంగా రిజిస్ట్రేషన్లు లేకుండా భూములను అనుభవిస్తున్న అర్హులైన రైతులకు నిబంధనల మేరకు యాజమాన్య హక్కులు కల్పించే దిశగా ఈ ప్రక్రియను సమర్థ వంతంగా నిర్వహిం చడం అధికారుల బాధ్యత అని ఆమె పేర్కొన్నారు.⁻ ైతులు, భూ యజమానులు కూడా అధికారులకు అవసరమైన పత్రాలను అందించి, భూముల వాస్తవ పరిస్థితిని తెలియజేసి ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా సహకరించాలని తెలిపారు.ఈ అవగాహన కార్యక్ర మంలో నరసా పురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. దాసిరాజు, ల్యాండ్ సర్వే ఏడీ జాషువా, డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, కాళీపట్నం భూముల సర్వేకు కేటాయించిన ఇతర సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ 4వ, మహాసభలను విజయవంతం చేయండి: గీత మహేందర్

పరిగి సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం




అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జాతీయ 4వ, మహాసభలు సెప్టెంబర్ 28,29,30 ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని అట్టి మహాసభలకు రైతులు, రైతు కూలీ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయ వంతం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వై మహేందర్ కోరారు నేడు జాతీయ మహా సభ పోస్టర్లను ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు మహేందర్ , జిల్లా కార్యదర్శి బి మల్లేశ్ ల ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో పోస్టర్లు ఆవిష్కరించడం జరిగింది ఈ సందర్భంగా

వై మహేందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నదని అమెరికా యూరోపియన్ దేశాలతో చేసుకున్న స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇట్టి ఒప్పందాల మూలంగా సంపన్న దేశాలు ఆహార ఉత్పత్తులను ఎలాంటి సుంకాలు లేకుండా మనదేశంలో కుప్పలు, కుప్పలుగా, దిగుమతి అవుతాయని మన ఉత్పత్తులను ఎగుమతి చేస్తే అధిక సుంకాలు విధిస్తారని వారన్నారు ఈ విదంగా రైతు పంటలకు ధరలు లేక పెట్టుబడి ఖర్చులు పెరిగి మన దేశ రైతులను నిలువు దోపిడీకి మరియు అప్పుల చక్రబంధంలో చిక్కుకపో తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.రైతు ఆదాయాన్ని రెట్టింపు చేస్తానన్న కేంద్ర ప్రభుత్వం కనీసం ఎం ఎస్ పి మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని పార్లమెంటులో తీసుక రావడంలో తీవ్రంగా విఫలమ య్యారని వారు అన్నారు ఇటీవల విద్యుత్ చట్టం, విత్తన చట్టం, వి రామ్ జి, చట్టాలను తీసుకువచ్చిన ఈ చట్టాల వల్ల రైతులు తమ భూముల నుండి కూలీలు ఉపాధి నుండి దూరమ వుతారని కావున తీసుకువచ్చిన నూతన చట్టాలను తక్షణమే రద్దు చేయాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఇలాంటి సంక్షోభ సమయంలో ఈ మహాసభలకు ప్రత్యేకత ఉన్నదని రాబోయే రోజుల్లో కేంద్రంలో, రాష్ట్రంలో, పాలక వర్గాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా రైతులందరినీ ఐక్యపరిచి బలమైన రైతాంగ ఉద్యమాలను నిర్మించడానికి తగిన కర్తవ్యా లను ప్రణాళికను ఈ సభలో రూపొందిం చుకుంటామని వారు తెలిపారుకావున ఈ మహా సభలు విజయవంతం చేయడానికి జిల్లా నుండి రైతులు, రైతు- కూలీలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో ఎ ఐ కె ఎం ఎస్ జిల్లా నాయకులు రాములు, గోపాల్, జైపాల్ , శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు

# అత్యుత్తమ వైద్యసేవలతో ప్రజారోగ్యరక్షణలో అగ్రస్థానంలో నిలవాలి : ప్రత్తిపాటి

**-వైద్యారోగ్యశాఖ, ఆశ సిబ్బందికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి సూచన**

**-ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉత్తమ పనితీరు చూపండి.**

**-నియోజకవర్గ స్థాయి వైద్యారోగ్య శాఖ సమీక్ష సమావేశంలో ప్రత్తిపాటి.**

చిలకలూరిపేట సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం





ప్రజారోగ్య పరిరక్షణకోసం వైద్యారోగ్య శాఖ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని, ప్రభుత్వ వైద్యసేవల అందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచి, నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలపాల ని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు చిలక లూరిపేట వైద్యారోగ్య శాఖ యంత్రాంగానికి సూచిం చారు. శనివారం సాయంత్రం స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్ లో జిల్లావైద్యారోగ్య అధికారి మన్మోహన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా వైద్యదిఖారులందరితో జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడారు. అత్యుత్తమ వైద్యసేవలతోనే ప్రజలకు మెరుగైన ఆరోగ్యం.ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అత్యుత్తమ వైద్యసేవలు అందినప్పుడే ప్రజలకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ఈ దిశగా నియోజకవర్గ వైద్యారోగ్య సిబ్బంది, ఆశ వర్కర్లు కృషి చేయాలని ప్రత్తిపాటి సూచించారు. స్థానికంగా ఉన్న కాటన్ పరిశ్రమల్లో ఉపాధి కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు చిలకలూరిపేటలో అధికంగా ఉన్నారని, వారందరి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని సంపూర్ణ వివరాలు సేకరించాలని ఎమ్మెల్యే వైద్యారోగ్య సిబ్బందిని ఆదేశించారు. హెచ్.ఐ.వీ, ఇతర దీర్ఘకాలిక వ్యాధుల తో బాధపడేవారి ఆరోగ్యరక్షణలో నిత్యం అప్రమ త్తంగా ఉండాలన్నారు. పేదల ఆరోగ్య రక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఎన్టీఆర్ వైద్యసేవ పథకాన్ని సక్రమంగా వినియోగించాలని ఆయన సూచించారు. కొన్ని నెట్ వర్క్ ఆసుపత్రులు ఎన్టీ ఆర్ వైద్య సేవ పథకం లబ్ధిని పొందుతూనే, అదనంగా రోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని, అలాంటి చర్యలను ఎవరూ సమర్థిం చవద్దని ఎమ్మెల్యే స్పష్టంచేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంజీని ప్రాజెక్ట్ ను నియోజకవర్గంలో సమగ్రంగా అమలు చేయాలని, వైద్యవిభాగం అధికా రులు, సిబ్బంది ఉత్తమ పనితీరుతో ప్రజలకు చేరువ కావాలని ప్రత్తిపాటి సూచించారు. 108, 104 విభాగాల పనితీరు మెరుగుపడాలని, తల్లీ బిడ్డ ఎక్స్ ప్రెస్ సేవలపై ప్రజల సంతృప్తిస్థాయి పెరగాలని ఆయన సూచించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులకు అందించే ప్రభుత్వ వైద్య సేవలు మెరుగుపడాలన్నారు. సమీక్ష సమావేశంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డు చైర్మన్ షేక్ కరిముల్లా, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, జిల్లా వైద్యాధి కారులు చంద్రశేఖర్, మాధవి లత, హనుమ, మురళీకృష్ణ, డాక్టర్లు, నర్సులు తదితరులు పాల్గొన్నారు.

వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 20 సెప్టెంబర్ 2026

# చిలకలూరిపేట మార్కెట్ సెంటర్‌లో 'స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర' కార్యక్రమం





**చిలకలూరిపేట సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం**

ప్రతి నెలా మూడో శనివారం నిర్వహిస్తున్న'స్వచ్ఛాంధ్ర -- స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా చిలకలూరిపేట మార్కెట్ సెంటర్‌లో పారిశుద్ధ్యకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు,ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మార్కెట్ ప్రాంతాన్ని శుభ్రం చేశారు. మార్కెట్ సెంటర్ ప్రాంతాన్ని రోజుకు రెండుసార్లు శుభ్రం చేస్తున్నప్పటికీ, పండ్ల మార్కెట్ నుంచి వచ్చే చెత్త వల్ల ప్రతి గంటకు వ్యర్థాలు పేరుకుపోతున్నాయని, అందుకే ఈ ప్రాంతంలో ప్రత్యేక పరిశుభ్రతా కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రాష్ట్రంలో అంటు వ్యాధులు, విషజ్వరాల బారిన పడకుండా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం, పరిసరాలు మరియు పట్టణ పరిశుభ్రతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడమని అధికారులు వెల్లడించారు. ముఖ్య మంత్రి పిలుపు మేరకు రాష్ట్రంలోని 175 నియోజ కవర్గాల్లో అధికారులు,ప్రజాప్రతినిధులు మరియు ప్రజలందరినీ భాగస్వామ్యం చేస్తూ ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

# ఆయిల్ ఫామ్ సాగు ఆసక్తి ఉన్న రైతులకు శిక్షణ కార్యక్రమం

-ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

-రైతులు సద్వినియోగం చేసుకోవాలి: ఉద్యాన శాఖ అధికారులు





**మెంటాడ సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం**

మెంటాడ మండలం జి.టి.పేట గ్రామంలో శనివారం ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్‌పామ్ రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం, రస్తాకుంటుబాయి, పార్వతీపురం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస రావు రాజు పాల్గొని ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు.ఆయిల్‌పామ్ మొక్కల ఎంపిక, ఎరువుల యాజమాన్యం, డ్రిప్ ద్వారా ఫెర్టిగేషన్ ఆవశ్యకత, నీటి యాజమాన్యం, చీడపీడల నివారణ, సస్యరక్షణ చర్యలు, అంతర పంటల సాగు--నిర్వహణ తదితర అంశాలను శాస్త్రవేత్త వివరించారు. ఆయిల్‌పామ్ సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయం పొందవచ్చని రైతులకు తెలిపారు.ఈ సందర్భంగా గజపతినగరం ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ ఉద్యాన శాఖ ద్వారా ఆయిల్‌పామ్ మొక్కలను రైతులకు 100 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో రైతుకు గరిష్టంగా 15 హెక్టార్ల వరకు సబ్సిడీ వర్తిస్తుందని చెప్పారు. మొదటి నాలుగు సంవత్సరాల్లో ఆయిల్ పామ్, అంతర పంటల నిర్వహణకు హెక్టారుకు రూ.21,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.అలాగే వర్మీకంపోస్ట్ యూనిట్‌కు రూ.18,000, చాఫ్ కట్టర్‌కు రూ.50,000, ఐదేళ్లు దాటిన ఆయిల్‌పామ్ తోటలకు మినీ ట్రాక్టర్ విత్ ట్రాలీకి రూ.1,00,000, గెలల కోత కత్తులకు రూ.2,500, కొత్తగా ఏర్పాటు చేసే తోటల్లో ఎలుకల నుంచి పంటను రక్షించేందుకు వైర్ మెష్ ఏర్పాటుకు రూ.20,000 వరకు రాయితీ అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ పంటను ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఆయిల్‌పామ్ కంపెనీల ద్వారా ప్రతి నెల కొనుగోలు చేస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎఫ్ఎఫ్‌బీ టన్నుకు రూ.24,010 ధర ఉందని, సరైన యాజమాన్య పద్ధతులతో సగటున ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి పొందే అవకాశం ఉందని తెలిపారు. రైతులు ఆయిల్‌పామ్ సాగు వైపు ముందుకు వచ్చి అందుబాటులో ఉన్న ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చలుమూరి వెంకట్రావు, పీఏసీఎస్ అధ్యక్షులు గొర్లె ముసలి నాయుడు, దాట్ల హనుమంతరాజు, రాజు అప్పలనాయుడు, వీఎస్ఏలు ఎస్ సన్యాసినాయుడు, వెంకటరమణ, రాధికా ఆయిల్ పామ్ కంపెనీ ప్లాంటేషన్ మేనేజర్ శంకర్, ఫీల్డ్ అసిస్టెంట్ మహేష్‌తో పాటు పెద్ద ఎత్తున రైతులు, ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి ఉన్న రైతులు పాల్గొన్నారు.

# పుట్టగొడుగుల పెంపకంపై ప్రత్యేక శిక్షణ



**తాడేపల్లి గూడెం సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం**

మండలంలోని వెంకట్రామన్న గూడెం డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో "పుట్ట గొడుగుల పెంపకం" పై శనివా రం ప్రత్యేక నైపుణ్యతా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వ విద్యాలయం ఉపకులపతి డాక్టర్ కట్టుపల్లి ధనుంజయ రావు మాట్లాడుతూ ప్రతి రైతు కుటుంబం నుండి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త రావాలనే గౌరవముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయు డు గారి ఆలోచనకు అనుగు ణంగా ఉద్యాన విశ్వవిద్యాల యం ద్వారా నిరంతరం నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందిస్తున్నామని తెలిపారు. ప్రస్తుత ఎల్-నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పుష్కల మైన పౌష్టికాహార విలువలు కలిగిన పుట్టగొడుగుల పెంపకం ద్వారా రైతులు ప్రత్యామ్నాయ ఆదాయాన్ని పొందవచ్చని సూచించారు. ప్రభుత్వం ద్వారా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద లభించే ప్రోత్సాహకాలు, శిక్షణ, నిల్వ మార్కెటింగ్ సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ కుటీర పరిశ్రమలు స్థాపించాల ని పిలుపునిచ్చారు. ఉపకులపతి ఆదేశాల మేరకు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నుండి హాజరైన 33 మంది శిక్షణార్థులకు పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు మొదట ఒకరోజుగా నిర్ణయించిన ఈ శిక్షణను మరో రెండు రోజుల పాటు పొడిగించారు. విశ్వవిద్యాల యం విస్తరణ కార్యక్రమాలను సామా జిక మాధ్య మాల ద్వారా రైతులకు చేరవేయా లని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పుట్ట గొడుగుల పెంపకం పై రూపొం దించిన తెలుగు కరపత్రికల ను ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ సి.హెచ్. రూత్ పుట్టగొడుగుల ఆరోగ్య ప్రయోజనాలను వివరించగా, ఉద్యాన కళాశాల ప్లాంట్ పాథాలజీ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి ర్మయి మాధవి పుట్ట గొడుగుల సాగు విధానాలపై సమగ్ర అవగాహన కల్పించా రు. సీనియర్ శాస్త్రవేత్త, కేవీకే అధిపతి డాక్టర్ సి.హెచ్. కిరణ్ కుమార్ పుట్టగొడుగుల ప్రాముఖ్యతను వివరించి, రైతులను క్యాంపస్ లోని సాగు కేంద్రానికి క్షేత్ర సందర్శనకు తీసుకెళ్లారు. కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎ. దేవివర ప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఇ. రేఖ, డాక్టర్ కె. అర్చన, ఆఫీసు సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# చిలకలూరిపేట జాతీయ రహదారిపై ఫ్లెక్సీలను తొలగించాలి!

## ముఖ్యమంత్రికి మాదాసు భాను ప్రసాద్ లేఖ



**చిలకలూరిపేట సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం:**

చిలకలూరిపేట జాతీయ రహదారిపై ప్రమాదకర ఫ్లెక్సీలను నియంత్రించి, ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరుతూ సామాజికవేత్త, అడ్వకేట్ మాదాసు భాను ప్రసాద్ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు లేఖ వ్రాశారు. ఆగస్టు 27న చిలకలూరిపేట అడ్డరోడ్డు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయిన నేపథ్యంలో రహదారి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన కోరారు.జాతీయ రహదారిపై కూడళ్లు, మలుపులు, కార్నర్ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న భారీ ఫ్లెక్సీల వల్ల వాహనదారుల దృష్టికి ఆటంకం కలిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రమాదకరంగా ఉన్న ఫ్లెక్సీలను తొలగించి, భవిష్యత్తులో అలాంటి ఫ్లెక్సీలు ఏర్పాటు కాకుండా శాశ్వత నియంత్రణ చర్యలు తీసుకోవాలని కోరారు."ప్రచారం కోసం ఏర్పాటు చేసే ఫ్లెక్సీ కంటే ప్రజల ప్రాణం ఎంతో విలువైనది" అని మాదాసు భాను ప్రసాద్ పేర్కొన్నారు. కళ్యాణి సెంటర్, విజయ బ్యాంక్ సెంటర్, నరసరావుపేట సెంటర్, ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సిగ్నల్ లైట్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు ద్వారా వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు పాదచారులు, విద్యార్థు ల భద్రతను పెంచవచ్చని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ తదితర ట్రాఫిక్ ఉల్లంఘనలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతా లను గుర్తించి వీధి దీపాలు, రోడ్ మార్కింగ్స్, హెచ్చ రిక బోర్డులు వంటి రహదారి భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని తన లేకపై ముఖ్యమంత్రి, సంబంధిత శాఖలు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన లేఖలో కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణ ప్రసాద్, మురికిపూడి ప్రసాద్, కంద భాస్కర్, అడపా రవి తదితరులు పాల్గొన్నారు.

# బాధితుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



**(తాడేపల్లి గూడెం) సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం**

అగ్ని ప్రమాదంలో గాయపడి వైద్య చికిత్స పొందుతున్న స్థానిక కళాశాల విద్యార్థి పాలూరి థోరన్ కి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ పది వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. బాధితుడికి అవసరమైన వైద్య చికిత్స అందేలా అండగా ఉంటామని ఆయన హామీ ఇచ్చారు.విద్యార్థి థోరన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఎమ్మెల్యే, ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వం, నాయకత్వం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఎన్డీయే కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొని బాధితుడి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

# భక్షుమేస్త్రిని పరామర్శించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం**



పట్టణంలోని రాగన్నపాలెం వాస్తవ్యులు మున్సిపల్ మాజీ కో-ఆప్షన్ సభ్యులు షేక్ భక్షు మేస్త్రి అనారోగ్య సమస్యతో శస్త్ర చికిత్స చేయిం చుకొని ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకొని వారి నివాసానికి వెళ్లి వారిని పరామర్శించిన శాసనమండలి సభ్యులు మర్రి రాజశేఖర్ ఈ సందర్భంగా భక్షు మేస్త్రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మర్రి రాజశేఖర్ పూర్తిగా కోలుకునే వరకు వైద్యుల సూచనలు తప్పక పాటిస్తూ, తగిన విశ్రాంతి తీసుకోవాలని, ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వారితో పఠాన్ నజీర్ ఖాన్ ,ఏ వి ఎం సుభాని, సయ్యద్ హిదాయతుల్లా తదితరులున్నారు.

# ఆధ్యాత్మికతకు ప్రతీక వినాయక చవితి వేడుకలు



**భీమవరం సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం**

వినాయక చవితి వేడుకలు ఆధ్యాత్మికత సమాజంలో ఐక్యత, సేవాభావం సోదరభావాన్ని పెంపొందిస్తాయని, భక్తులందరూ శాంతి, సౌభాగ్యం, ఆయురారో గ్యాలతో ఉండాలని రాష్ట్ర కృష్ణ బలిజ పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డా గంటా త్రిమూర్తులు అన్నారు. భీమవరం 10వ వార్డు యాదవుల వీధిలో వినాయక చవితి సందర్భంగా శ్రీకృష్ణ గణేష్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాన్ని చైర్మన్ త్రిమూర్తులు ప్రారంభించారు. ముందుగా శ్రీవినాయక స్వామివారిని భక్తి శ్రద్ధలతో దర్శించుకుని స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భక్తులకు అన్న ప్రసాదాన్ని స్వయంగా వడ్డించారు. భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వేడుకలను నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను చైర్మన్ త్రిమూర్తులు అభినందించారు. ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను మరింత పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో భీమవరం పట్టణ జాయింట్ సెక్రటరీ యలమంచిలి శ్రీనివాసరావు, శ్రీకృష్ణ గణేష్ యూత్ కమిటీ సభ్యులు జి రాంబాబు, జి దుర్గారావు, జి వాసు, వై కృష్ణ తేజ, వై వరప్రసాద్, శివ, కె కిరణ్, జి వెంకటేష్, జి నాగ, బి ప్రశాంత్, ఎం సూర్య, డి దుర్గ, ఎస్ మనోజ్, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు, యువత భక్తులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి వర్యులు విడదల రజిని

**యడ్లపాడు సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం**



యడ్లపాడు గ్రామ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సాగి బాలాజీ వివాహం ఇటీవల జరగగా వారి నివాసానికి వెళ్లి నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి వర్యులు విడదల రజిని

# చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి చిరునామాగా ఏపీ : ప్రత్తిపాటి







**-ముస్లిం మైనారిటీలకు టీడీపీ పాలనలో జరిగిన మేలు.. మరే ప్రభుత్వంలో జరగలేదు.**

**-కూటమి ప్రభుత్వంలో మైనారిటీలు సంతోషంగా ఉన్నారు.**

**- సాతులూరులో రూ.50 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవాల్లో పాల్గొన్న ప్రత్తిపాటి.**

చిలకలూరిపేట సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం

ఏపీని అభివృద్ధికి చిరునామాగా మార్చాలన్న పటుదల, సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు రేయింబవళ్లు శ్రమిస్తున్నారని, ఆయన నాయకత్వంలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. శనివారం ఆయన నాదెండ్ల మండలం సాతులూరులో రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. స్థానిక నాయకులతో కలిసి పొలిమేర వద్ద రూ.10 లక్షల మైనింగ్ నిధులతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించిన ప్రత్తిపాటి.. ఎన్టీఆర్ కూడలిలో రూ.20 లక్షల టీటీడీనిధులతో నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలోని శివాలయం వద్ద రూ.20 లక్షల జీ.రామ్. జీ నిధులతో నిర్మించిన మరో వంతెనని ప్రారంభించారు. అనంతరం ముస్లింల ఈద్గా నిర్మాణ స్థలాన్ని పరిశీలించి, వారితో ముఖాముఖీ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి మంజూరైన అభివృద్ధి పనుల్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిచేసి ఉంటే, నేడు ప్రజలు ఎలాంటి సమస్యల్లేకుండా సంతోషంగా జీవించేవారని, గత పాలకుల నిర్లక్ష్యం, అవినీతి పోకడలు, స్వార్థ రాజకీయాలు ప్రజలకు కష్టనష్టాలు తీసుకొచ్చాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు. ముస్లింలకు టీడీపీ పాలనలోజరిగిన మేలు.. మరే ప్రభుత్వంలోనూ జరగలేదు..టీడీపీ పాలనలో ముస్లిం-మైనారిటీలకు జరిగిన మేలు.. మరే ప్రభుత్వంలోనూ జరగలేదని, ఇమామ్-మౌజమ్ లకు గౌరవవేతనం, మదర్సాలు, షాదీఖానాలు, ఈద్గాల నిర్మాణం, వక్స్ భూముల పరిరక్షణ, దుకాన్ -- మకాన్, రంజాన్ తోఫా, పెండ్లి కానుక వంటి ప్రయోజనాలు విరివిగా లభించాయని ప్రత్తిపాటి వివరించారు. కూటమి ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలు సంతోషంగా ఉన్నారని, వారి రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి చంద్రబాబు ప్రభుత్వం కృషి చేస్తోందని, వారి హక్కుల్ని కాపాడుతూ.. సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, టీడీపీ నాయకులు నార్నే కోటయ్య స్వామి, షేక్ సైదా, శివ సత్యం, నందిగాం శివయ్య, నార్నే శ్రీను, కమ్మ శ్రీను, జంపని వసంతరావు, చుండు అనిల్, ఈధర సాంబశివరావు, ఐనవోలు రాధా, చెన్నకేశవులు టీడీపీ నాయకులు, కూటమి నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమావుళ్ళమ్మ అన్న ప్రసాద వితరణకు ఛాంబర్ పరిశీలన





**-భక్తులకు మెరుగైన సౌకర్యాలు, అన్న ప్రసాద వితరణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలి...**

**-ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, దేవస్థాన సభ్యులతో ఎమ్మెల్యే అంజిబాబు సమీక్ష**

భీమవరం సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం

రాష్ట్రంలోనే పేరుగాంచిన భీమవరం శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారని, వారికి అన్న ప్రసాదాన్ని అందించడానికి వీలైనంత విశాలమైన స్థలం అందుబాటులో ఉండాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శ్రీమావుళ్ళమ్మ దేవస్థానంకు దగ్గర ఉన్నా ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనాన్ని శనివారం ఎమ్మెల్యే అంజిబాబు దేవస్థానం సభ్యులు, ఛాంబర్ సభ్యులతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఇటీవలే లీజుకు తీసుకున్న 9 సెంట్ల స్థలంలో ప్రతిరోజు 200 నుంచి 300 మంది భక్తులకు భోజనం అందిస్తున్నామని, కొద్దిగా విశాలమైన స్థలం ఉంటే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఉండవచ్చని వారు ఎమ్మెల్యే అంజిబాబు కు తెలిపారు. దీనిపై ఎమ్మెల్యే అంజిబాబు మాట్లాడుతూ భక్తులకు మెరుగైన సౌకర్యాలు, అన్న ప్రసాద వితరణకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల న్నారు. రానున్న రోజుల్లో అమ్మవారిని చూసేందుకు వేలల్లో భక్తులు తరలిరానున్నారని, దాని దృష్ట్యా ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

# లయన్స్ క్లబ్ దూబచర్ల ఆధ్వర్యంలో డెంటల్ స్క్రీనింగ్ రక్తదానం శిబిరం







నల్లజర్ల సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం

సిల్వర్ జూబ్లీ సందర్భంగా ఉచిత డెంటల్ స్క్రీనింగ్, రక్తదాన శిబిరం దూబచర్ల: లయన్స్ క్లబ్ దూబచర్ల 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీని పురస్కరించుకుని పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దూబచర్ల ఎలైట్ కాలేజీలో ఉచిత డెంటల్ స్క్రీనింగ్ క్యాంప్ మరియు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. భీమవరం విష్ణు డెంటల్ కాలేజీ సహకారంతో ఉచిత డెంటల్ స్క్రీనింగ్ క్యాంప్, ఏలూరు బ్లడ్ సెంటర్ సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ శిబిరాన్ని ఆంధ్ర ప్రదేశ్ స్వచ్ఛఆంధ్ర డైరెక్టర్ కూచి పూడి ఉదయ భాస్కరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారం భించారు. భీమవరం విష్ణు డెంటల్ కాలేజీకి చెందిన డాక్టర్ కె. చైతన్య రామ్ మరియు దంత వైద్యుల బృందం ప్రజలకు దంత పరీక్షలు నిర్వహించి, దంత ఆరోగ్యం, పరిశుభ్రత, సమస్యల నివారణపై అవగా హన కల్పించారు.రక్తదాన శిబిరంలో ఏలూరు బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. శశికళ, కౌన్సిలర్ జి. జయలక్ష్మి వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఎలైట్ కాలేజీ విద్యార్థులు 50 మందికి పైగా స్వచ్ఛందంగా రక్తదానం చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. యువత రక్తదా నానికి ముందుకు రావడం అభినందనీయమని నిర్వా హకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు అంబటి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ దూబ చర్ల అధ్యక్షులు తమ్మిన శ్రీనివాసరావు, సెక్రటరీ నెక్కంటి వెంకటేష్, పార్డ్ ఇండియా నల్లజర్ల శాఖ అధ్యక్షులు మహమ్మద్ ఇలియాస్ షరీఫ్, చీమకుర్తి కృష్ణ ప్రసాద్, ఎలైట్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ కరగల శ్రీలక్ష్మి, డైరెక్టర్లు యలమర్తి సుదర్శన్ రావు, గారపాటి సుబ్బా రావు, సోమిశెట్టి వెంకటరావు, జామి రాంబాబు, మద్దాల రాం బాబు, చిట్యాల సత్యనారాయణమూర్తి, ముత్త నాగా ర్జున, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.లయన్స్ క్లబ్ దూబచర్ల 25 సంవత్సరాల సేవా ప్రయాణంలో భాగంగా ప్రజల ఆరోగ్యం, విద్య, సామాజిక సంక్షేమానికి ఉపయో గపడే సేవా కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సహక రించిన విష్ణు డెంటల్ కాలేజీ వైద్య బృందం, ఏలూరు బ్లడ్ సెంటర్ సిబ్బంది, ఎలైట్ విద్యాసంస్థల యాజ మాన్యం, రక్తదాతలు స్వచ్ఛంద సేవకులకు నిర్వా హకులు కృతజ్ఞతలు తెలిపారు.

# పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయి

**-ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించిన మార్నింగ్ కాఫీ క్లబ్...**

భీమవరం సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం:

పదవులు బాధ్యతలను మరింత పెంచుతాయని, ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అభివృద్ధికి కమిటీ సభ్యులు కృషి చేయాలని మార్నింగ్ కాఫీ క్లబ్ ఫౌండర్ & కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్, కొత్త శ్రీనివాస్, పీఆర్వో భట్టిప్రోలు శ్రీనివాసరావు అన్నారు. భీమవరం డిఎన్నార్ కళాశాల రోడ్డులోని తాడిమళ్ళ వారి కాంప్లెక్స్ లో బుధవారం 2026-29 సంవత్సరంకు ఆర్యవైశ్య వర్తక సంఘ భవనంకు నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సత్కరించారు. ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం అధ్యక్షులు వబిలిశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు బొండాడ సుబ్బారావు, కార్యదర్శులుగా తటవర్తి మంగరాజు (రాజు), పరుచూరి నాగేశ్వరరావు, కోశాధికారి కురిశెట్టి కాశీ విశ్వనాథ్ లను సత్కరించారు. కారుమూరి సత్యనారాయణ మూర్తి, కోట్ల నాని, కురిశెట్టి నాని మాట్లాడుతూ ఆర్యవైశ్యుల ఐక్యతను చాటుతూ సంఘ భవనంను మరింత అభివృద్ధి చేసుకోవాలని నూతన కమిటీ సభ్యులను అభినందించారు. సన్మాన గ్రహీతలు తరుపున వబిలిశెట్టి మాట్లాడుతూ ఎంతో చరిత్ర కలిగిన వర్తక సంఘం కి మంచి పేరు తీసుకువస్తాము అని అన్నారు :అనంతరం వారిని సత్కరించారు. కార్యక్రమంలో కోట్ల రాంజీ, చవ్వ




శ్రీనివాస సుబ్బారావు, బంగారు రాము, బొండాడ మనీష్, కనగర్ల విజయరామకృష్ణ,మానేపల్లి రవి చిన్నారావు, కంచర్ల భాస్కరరావు, గుండు సుమూర్తి, చవ్వా భామ క్రిష్ణమూర్తి, గాదె నాగేశ్వరావు , సభ్యులు, మిత్రులు, పాలుగొన్నారు

# భీమవరం--లోసరి రహదారి నిర్మాణానికి ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టాలి

**-రూ.43 కోట్ల సీ ఆర్ ఎఫ్ నిధులతో నాలుగు లైన్ల రహదారి నిర్మాణం**

**-జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి...**



భీమవరం సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం

భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణానికి అవసరమైన ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణం కోసం చేపడుతున్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భీమవరం పట్టణం నుంచి లోసరి వరకు రహదారి నిర్మాణానికి ప్రభుత్వం సీ ఆర్ ఎఫ్ నిధుల నుంచి రూ.43 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఈ నిధులతో భీమవరం నుంచి లోసరి వరకు నాలుగు లైన్ల రహదారిని నిర్మించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రహదారి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని సిద్ధం చేయడంతో పాటు ఆక్రమణల తొలగింపు ప్రక్రియను నిబంధనల ప్రకారం వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.భీమవరం పట్టణంలోని డీ.ఎన్.ఆర్. కళాశాల, కే.జీ.ఆర్. కళాశాల వద్ద అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ.17.45 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా గొల్లవానిదిబ్బ నుంచి రామాయణపురం వరకు రహదారి విస్తరణకు రూ.7.25 కోట్లు మంజూరైనట్లు చెప్పారు.తోకతిప్ప, నాగేంద్రపురం ప్రాంతాల్లో రూ.8 కోట్ల వ్యయంతో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం మంజూరు చేసిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. భీమవరం నుండి లోసరి రహదారిలో ప్రభుత్వం మంజూరు చేసిన అప్రోచ్ రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణ ప్రాంతాలను ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నిర్దేశిత ప్రమాణాలు, నాణ్యతతో చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భీమవరం రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి, భీమవరం మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, ఆర్అండ్బీ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# భీమవరం 4, 5వ వార్డుల్లో 4 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు



భీమవరం సెప్టెంబర్ 19 వార్త సాక్ష్యం;

భీమవరం మున్సిపాలిటీ పరిధిలోని 4, 5వ వార్డులలో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, త్రాగునీరు లాంటి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పనకు సుమారు రూ. 4 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, భీమవరం ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ పులపర్తి రామాంజనేయులతో కలసి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఎంపీ నిధులతో పాటు ప్రభుత్వ సాధారణ నిధులను సద్వినియోగం చేస్తూ భీమవరం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ఎమ్మెల్యే రామాంజనేయులుతో కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే 4, 5వ వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో పాటు, త్రాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా ప్రత్యేక మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలతో సమావేశమైన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యత క్రమంలో వాటిని పరిష్కరించవలసిందిగా అధికారులను ఆయన ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నిర్దేశించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ఆదేశించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీ కృష్ణ బలిజ, పూసల వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, జనసేన రాష్ట్ర కార్యదర్శి వబిలిశెట్టి రామకృష్ణ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కలిదిండి వినోద్ వర్మ, కంటేటి వెంకటరాజు, అర్జున్ రాజు, సుబ్బరాజు, మన్నెం సతీష్, శివ రాజు, కాయిత సురేంద్ర, అడబాల శివ, వబిలిశెట్టి ప్రసాద్, వినాయక్ తదితర ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## అనిల్ అంబానీపై సీబీఐ ఎఫ్ఐఆర్




అనిల్ ధీరూబాయ్ అంబానీ గ్రూప్ (అడాగ్) చైర్మన్ అనిల్ అంబానీపై సీబీఐ ఉచ్చు బిగిస్తోంది. ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అనిల్ అంబానీతో పాటు గ్రూప్ మాజీ ఎండీ సతీష్ సేథ్, గుర్తు తెలియని కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులపైనా సీబీఐ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. వీరంతా 2012 ఏప్రిల్ – 2018 మార్చి మధ్య కాలంలో వివిధ గ్రూప్ కంపెనీల వ్యాపార అవసరాల పేరు మీద ఎన్‌సీడీల ద్వారా తమ నుంచి సమీకరించిన రూ.2,684.57 కోట్ల నిధులను దారి మళ్లించి స్వాహా చేశారన్న ఎల్ఐసీ రాతపూర్వక ఫిర్యాదుతో సీబీఐ ఈ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. తప్పుడు హామీలతో తమ నుంచి సమీకరించిన ఈ నిధులను అనిల్ అంబానీ, ఆయన నేతృత్వంలోని కంపెనీలు దారి మళ్లించి స్వాహా చేశాయని ఎల్ఐసీ ఫిర్యాదు చేసింది. అయితే అనిల్ అంబానీ ఈ విషయంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని ప్రకటించారు.

## మారుతి కార్లలో అదిరిపోయే అప్‌డేట్.. స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీలో ఏఎంటీ గేర్‌బాక్స్!

కొత్త కారు కొనాలని చూస్తున్న వారికి మారుతి సుజుకి గుడ్‌న్యూస్ చెప్పింది. స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీ మోడళ్లలో తొలిసారిగా ఏఎంటీ గేర్‌బాక్స్‌ను తీసుకొచ్చింది. ఫ్యాక్టరీలోనే అమర్చిన సీఎన్‌జీ యూనిట్ తో ఆటోమేటిక్ గేర్‌బాక్స్‌ను అందించడం మారుతి చరిత్రలో ఇదే తొలిసారి. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీ ప్రారంభ ధర రూ.7.92 లక్షలు కాగా.. డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ ధర రూ.8.53 లక్షలు. ఇవి ఎక్స్‌షోరూమ్ ప్రారంభ ధరలు.సంబంధిత సీఎన్‌జీ మాన్యువల్ వేరియంట్లతో పోలిస్తే ఏఎంటీ మోడళ్ల ధర రూ.35 వేలు ఎక్కువ. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీను వేరియంట్లలో తీసుకొచ్చారు. డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ వేరియంట్లలో లభిస్తుంది. సీఎన్‌జీతో ఏఎంటీను అందిస్తున్న దేశంలో రెండో సంస్థగా మారుతి నిలిచింది. ఇప్పటికే టాటా మోటార్స్ ఈ కాంబినే షన్‌ను అందిస్తోంది.స్విఫ్ట్, డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీలో 1.2 లీటర్, మూడు సిలిండర్ల జెడ్12ఈ పెట్రోల్ ఇంజిన్ ఉంటుంది. సీఎన్‌జీ మోడ్‌లో ఇది 70 హెచ్‌పీ శక్తి, 102 ఎన్ఎం టార్క్ ఉత్పత్తి చేస్తుంది. 5-స్పీడ్ ఏఎంటీ గేర్‌బాక్స్‌తో ఇంజిన్‌ను జత చేశారు.మైలేజీ విషయంలోనూ మారుతి ఆకట్టుకునే గణాంకాలను ప్రకటించింది. స్విఫ్ట్ సీఎన్‌జీ ఏఎంటీ లీటర్‌కు కాకుండా కిలోగ్రామ్ సీఎన్‌జీకి 35.34 కిలోమీటర్ల మైలేజీ ఇస్తుందని కంపెనీ చెబుతోంది. డిజైర్ సీఎన్‌జీ ఏఎంటీ 36.47 కిలోమీటర్లు ఇస్తుందని పేర్కొంది. మాన్యువల్ మోడళ్లతో పోలిస్తే ఇవి వరుసగా 2.49, 2.74 కిలోమీటర్లు ఎక్కువ.సీఎన్‌జీ ట్యాంక్ అదనపు బరువును తట్టుకునేలా సస్పెన్షన్‌ను మార్చారు. సీఎన్‌జీ ఫ్యూయల్ లెవల్ ఇండికేటర్, పెట్రోల్- సీఎన్‌జీ మధ్య సులభంగా మారేందుకు ఫ్యూయల్




స్విచ్ కూడా ఉన్నాయి. అయితే 55 లీటర్ల సామర్థ్యం ఉన్న సింగిల్ సీఎన్‌జీ ట్యాంక్ కారణంగా బూట్ స్పేస్ కొంత పరిమితంగా ఉంటుంది.ఇదే అప్‌డేట్‌లో భాగంగా బాలెనో సీఎన్‌జీ ఏఎంటీను కూడా మారుతి తీసుకొచ్చింది. దీని ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధర రూ.8.32 లక్షలు. ఆటోమేటిక్ డ్రైవింగ్ సౌకర్యంతో పాటు సీఎన్‌జీ తక్కువ రన్నింగ్ ఖర్చు, తక్కువ ఉద్గారాలను కలపడం తమ 'ఆటో గ్రీన్ మిషన్' లక్ష్యమని కంపెనీ తెలిపింది.

## యూపీఐ చెల్లింపులపై కొత్త ఛార్జీలు.. నిరసనకు దిగిన వ్యాపారులు.. కొత్త రూల్‌పై గందరగోళం

దేశంలో డిజిటల్ చెల్లింపుల విప్లవానికి కారణమైన యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)పై కొత్తగా ఛార్జీలు విధించాలన్న ప్రతిపాదన వ్యాపారుల నుంచి తీవ్ర వ్యతిరేకతకు దారితీస్తోంది. ఘజియాబాద్‌లోని పలువురు వ్యాపారులు దీనికి నిరసనగా తమ దుకాణాల ముందు 'యూపీఐ చెల్లింపులు స్వీకరించబడవు' అంటూ నోటీసులు అంటిస్తున్నారు. అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు పైబడిన ఎంపిక చేసిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధించాలన్న నిర్ణయమే ఈ ఆందోళనకు కారణం.వ్యాపారులు ఈ అదనపు భారాన్ని మోయడానికి సిద్ధంగా లేరు. ఈ ఛార్జీలను ప్రభుత్వం వ్యాపారుల నుంచే వసూలు చేస్తుందని చెప్పినప్పటికీ, ఇది పరోక్షంగా వినియోగదారులపైనే ప్రభావం చూపుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందుకే, అక్టోబర్ 15 నుంచి రూ.2,000కు మించిన కొనుగోళ్లకు నగదు తీసుకురావాలని వినియోగదారులకు సూచిస్తున్నారు. ఈ కొత్త ఛార్జీల భారాన్ని తాము భరించలేమని, అందుకే పెద్ద మొత్తంలో చెల్లింపులకు నగదు అడగాల్సి వస్తుం దని వారు చెబుతున్నారు. అక్టోబర్ 15 నుంచి ఏం మారుతుంది?కొత్త నిబంధనల ప్రకారం.. అక్టోబర్ 15 నుంచి వినియోగదారుడి నుంచి వ్యాపారికి (పర్సన్-టు-మర్చంట్) చేసే రూ.2,000కు పైబడిన యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఎండీఆర్ వర్తిస్తుంది. ఈ ఛార్జీని కస్టమర్ కాకుండా, సదరు వ్యాపారి చెల్లించాల్సి ఉంటుంది. లావాదేవీ విలువ రూ.75,000 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే, ఈ ఛార్జీ గరిష్టంగా రూ.300గా పరిమితం చేశారు. అయితే, వ్యక్తుల మధ్య జరిగే యూపీఐ చెల్లింపులు, అలాగే రూ.2,000 లోపు




చేసే వ్యాపార చెల్లింపులపై ఎలాంటి ఛార్జీలు ఉండవు. ప్రస్తుతం జరుగుతున్న 'పర్సన్-టు-మర్చంట్' (పీ2ఎం) లావాదేవీలలో 95 శాతానికి పైగా రూ.2,000 లోపువే కాబట్టి, వాటిపై ఈ కొత్త నిబంధన ప్రభావం ఉండదు. అంటే, దుకాణంలో రూ.1,500 వస్తువును యూపీఐ ద్వారా కొంటే ఎలాంటి అదనపు రుసుము ఉండదు. అధిక విలువైన లావాదేవీలకే ఈ మార్పు వర్తిస్తుంది.

## జపాన్‌లో 20వ ఆసియా క్రీడలు అట్టహాసంగా ప్రారంభం.. భారత అథ్లెట్లకు ప్రధాని మోదీ విషెస్

ఆసియా ఖండంలోనే అతిపెద్ద క్రీడా సంబరం మొదలైంది. జపాన్‌లోని ఐచీ-నగోయా నగరాలు వేదికగా 20వ ఆసియా క్రీడలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. నగోయాలోని మిజుహో పార్క్ అథ్లెటిక్ స్టేడియంలో జరిగిన అట్టహాస వేడుకలో జపాన్ చక్రవర్తి నరుహిటో ఈ క్రీడలను అధికారికంగా ప్రారంభించినట్లు ప్రకటించారు. రాబోయే రెండు వారాల పాటు వేలాది మంది క్రీడాకారులు పతకాల కోసం పోటీ పడనున్నారు.ఈ చారిత్రాత్మక ఈవెంట్ సందర్భంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, దేశ క్రీడా బృందానికి తన శుభాకాంక్షలు తెలిపారు. "ఐచీ-నగోయాలో ఆసియా క్రీడలు ప్రారంభమవుతున్న వేళ, భారత బృందానికి నా శుభాకాంక్షలు. ప్రతి క్రీడాకారుడు అద్భుతమైన కృషి, అంకితభావం, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారు. వారిని చూసి భారతదేశం గర్విస్తోంది. వారు తమ అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలి, బాగా ఆడాలి, ప్రకాశించాలి!" అని ప్రధాని 'ఎక్స్' వేదికగా పోస్ట్ చేశారు.ప్రారంభోత్సవ వేడుక భారత్‌కు ఎంతో ప్రత్యేకంగా నిలిచింది. ఒలింపిక్ పతక విజేత, షూటర్ మను భాకర్, కబడ్డీ స్టార్ పవన్ సెహ్రావత్ భారత బృందానికి పతాకధారులుగా ముందుండి నడిపించారు. త్రివర్ణ పతాకాన్ని చేతబూని స్టేడియంలోకి అడుగుపెట్టిన వీరిపై దేశం భారీ అంచనాలు పెట్టుకుంది. 2023లో హాంగ్‌జౌలో జరిగిన గత ఆసియా క్రీడల్లో 28 స్వర్ణాలతో సహా మొత్తం 107 పతకాలు సాధించి భారత్ రికార్డు సృష్టించిన విషయం తెలిసిందే. ఈసారి ఆ రికార్డును




అధిగమించాలనే లక్ష్యంతో భారత బృందం బరిలోకి దిగుతోంది.ఆసియా క్రీడలకు జపాన్ ఆతిథ్యం ఇవ్వడం ఇది మూడోసారి. గతంలో 1958లో టోక్యోలో, 1994లో హిరోషిమాలో ఈ పోటీలు జరిగాయి. ఈసారి 45 దేశాలకు చెందిన క్రీడాకారులు 43 క్రీడాంశాల్లో తలపడనున్నారు.ఈ పోటీల్లో భారత్ పలు క్రీడల్లో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. పురుషుల, మహిళల క్రికెట్, కబడ్డీ జట్లతో పాటు, పురుషుల హాకీ జట్టు కూడా తమ టైటిళ్లను నిలబెట్టుకోవాలని చూస్తోంది. బ్యాడ్మింటన్‌లో పీవీ సింధు, వెయిట్‌లిఫ్టింగ్‌లో మీరా బాయి చాను భారత ప్రచారానికి నాయకత్వం వహించనున్నారు. షూటింగ్‌లో మను భాకర్, రెజ్లింగ్‌లో అమన్ సెహ్రావత్, బాక్సింగ్‌లో లవ్లీనా బోర్గోహెన్ వంటి ప్రముఖులు పతకాలపై కన్నేశారు. అథ్లెటిక్స్‌లో 75 మందికి పైగా భారత క్రీడాకారులు బరిలో ఉన్నారు. గుల్వీర్ సింగ్, తేజస్విన్ శంకర్, జ్యోతి యర్రాజీ, పారుల్ చౌదరి వంటి అథ్లెట్లు తమ సత్తా చాటడానికి సిద్ధమయ్యారు. షాట్‌పుట్‌లో తజిందర్‌పాల్ సింగ్ తూర్ వరుసగా రెండుసార్లు ఛాంపియన్‌గా నిలిచి, ఈసారి కూడా ఫేవరెట్‌గా పోటీ పడుతున్నాడు.

# స్పోర్ట్స్

## అట్టహాసంగా ఆసియా క్రీడలు ప్రారంభం.. భారత పతాకధారులుగా పవన్ సెహ్రావత్, మను భాకర్




జపాన్‌లోని ఐచి-నగోయాలో 20వ ఆసియా క్రీడలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. పాలోమా మిజుహో స్టేడియంలో జరిగిన ఆరంభ వేడుకల్లో భారత బృందానికి పతాకధారులుగా కబడ్డీ ప్లేయర్ పవన్ సెహ్రావత్, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ వ్యవహరించారు. వీరిద్దరూ త్రివర్ణ పతాకాన్ని చేతబూని భారత బృందాన్ని ముందుండి నడిపించారు.ఈ మెగా ఈవెంట్‌లో భారత్ తరఫున 36 క్రీడల్లో 503 మంది అథ్లెట్లు పోటీ పడుతున్నారు. వాస్తవానికి పురుషుల విభాగంలో ఫ్లాగ్ బేరర్‌గా షాట్‌పుటర్ తాజిందర్‌పాల్ సింగ్ తూర్‌ను ఎంపిక చేశారు. అయితే, అతడికి సంబంధించిన సెరిమోనియల్ కిట్ సకాలంలో అందకపోవడంతో వేడుకకు హాజరు కాలేకపోయాడు. దీంతో అతడి స్థానంలో పవన్ సెహ్రావత్‌కు ఈ గౌరవం దక్కింది. గత ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత కబడ్డీ జట్టులో పవన్ సభ్యుడిగా ఉన్నాడు. మహిళల విభాగంలో పతాకధారిగా వ్యవహరించిన మను భాకర్, పారిస్ 2024 ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది. స్వతంత్ర భారత చరిత్రలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన తొలి అథ్లెట్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఈ క్రీడల్లో ఆమె 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్లలో పోటీపడనుంది.గతంలో హాంగ్‌జౌ 2022 ఆసియా క్రీడల్లో 107 పతకాలతో రికార్డు సృష్టించిన భారత్, ఈసారి ఆ ప్రదర్శనను అధిగమించి మరిన్ని పతకాలు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

## రష్యాలో మళ్లీ క్రికెట్ సందడి.. ప్రారంభమైన టీ10 లీగ్.. టార్గెట్ ఒలింపిక్స్!

ఫుట్‌బాల్, ఐస్ హాకీ, చెస్ వంటి క్రీడలకు ప్రసిద్ధి చెందిన రష్యాలో ఇప్పుడు క్రికెట్ సందడి మొదలైంది. దేశంలో క్రికెట్‌ను పునరుజ్జీవింపజేయాలనే లక్ష్యంతో రష్యన్ క్రికెట్ ఫెడరేషన్ (క్రికెట్ రష్యా) సరికొత్త టోర్నమెంట్‌కు శ్రీకారం చుట్టింది. 'రష్యన్ టీ10 లీగ్' పేరుతో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్ శని, ఆదివారాల్లో (సెప్టెంబర్ 19, 20) జరగనుంది. చారిత్రాత్మక లుజ్నికి స్టేడియం ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తోంది.ఈ రెండు రోజుల ఈవెంట్‌లో మొత్తం నాలుగు జట్లు పోటీ పడుతున్నాయి. మాస్కో ఫాక్సెస్, క్రెమ్లిన్ స్టార్స్, కజాన్ ఫాల్కన్స్, సెయింట్ పీటర్స్‌బర్గ్ లయన్స్ టైటిల్ కోసం తలపడనున్నాయి. మొత్తం ఏడు మ్యాచ్‌లు జరగనుండగా, మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫైనల్ జరుగుతుంది.కేవలం టోర్నీ కాదు.. సుదీర్ఘ ప్రణాళిక ఈ లీగ్ ప్రారంభంపై రష్యన్ క్రికెట్ ఫెడరేషన్ డైరెక్టర్ సంభవ్ జైన్ మాట్లాడుతూ, "ఈ టోర్నమెంట్ కేవలం ఒక క్రీడా పోటీ మాత్రమే కాదు. రష్యా వ్యాప్తంగా క్రికెట్‌ను ప్రోత్సహించడం, కొత్త ఆటగాళ్లను, ప్రేక్షకులను ఆకర్షించడం, క్రీడాభివృద్ధికి మరిన్ని అవకాశాలు




సృష్టించడం అనే విస్తృత దృష్టిలో ఇది ఒక భాగం" అని వివరించారు. ఈ టోర్నీలో నాలుగు జట్ల తరఫున మొత్తం 60 మంది ఆటగాళ్లు పాల్గొంటున్నారని, వారి ప్రతిభను ప్రదర్శించడానికి, అనుభవం గడించడానికి ఇది ఒక చక్కని వేదిక అని ఆయన అన్నారు.

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# నాని 'ది ప్యారడైజ్' ప్రీ రిలీజ్ ఈవెంట్ ఎప్పుడు, ఎక్కడంటే..!



నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ది ప్యారడైజ్'. అందాలభామ కయాదు లోహర్ హీరోయిన్ గా నటించింది. సీనియర్ నటుడు మోహన్ బాబు ఇందులో ప్రతినాయక పాత్ర పోషించారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపుదిద్దుకున్నఈ సినిమా విడుదలకు సిద్ధమవుతున్న నేపథ్యంలో, చిత్ర బృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఇందులో భాగంగా సినిమా గ్రాండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు సంబంధించిన తేదీని, వేదికను అధికారికంగా ప్రకటించింది. ఈ వేడుకను సెప్టెంబర్ 21న హైదరాబా ద్‌లోని శిల్పకళా వేదికలో అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మేకర్స్ తెలిపారు.వివరాల్లోకి వెళితే, 'ది ప్యారడైజ్' చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. సినిమా రిలీజ్‌కు సరిగ్గా మూడు రోజుల ముందు, అంటే సెప్టెంబర్ 21న సోమవారం సాయంత్రం 6 గంటల నుంచి ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్ జరగనుంది. నానితో పాటు చిత్ర బృందం మొత్తం ఈ కార్యక్రమంలో పాల్గొని సినిమా విశేషాలను పంచుకోనున్నారు. అభిమానుల కోలాహలం మధ్య ఈ వేడుకను ఒక పండుగలా జరపడానికి నిర్మాతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.నాని సినిమాలకు ఉండే క్రేజ్ దృష్ట్యా, ప్రీ రిలీజ్ ఈవెంట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. హైదరాబాద్‌లో సినీ కార్యక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే శిల్పకళా వేదికలో ఈ వేడుకను ప్లాన్ చేయడంతో దీని ప్రాధాన్యత మరింత పెరిగింది. ఈ ఈవెంట్ ద్వారా సినిమాపై మరింత హైప్ తీసుకురావాలని చిత్ర యూనిట్ భావిస్తోంది.ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ఇతర ప్రచార చిత్రాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించగా, ఇప్పుడు ప్రీ రిలీజ్ ఈవెంట్‌తో సినిమా ప్రమోషన్లు తారాస్థాయికి చేరనున్నాయి. ఈ వేడుక కోసం నాని అభిమానులు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్ 24న థియేటర్లలోకి రానున్న "ది ప్యారడైజ్" ప్రేక్షకులను ఏ స్థాయిలో ఆకట్టుకుంటుందో వేచి చూడాలి.




## బిగ్ బాస్ వేదికపై బట్టలు విప్పేసిన సల్మాన్ ఖాన్.. ట్రోలర్స్‌పై ఆగ్రహం!

ప్రముఖ రియాలిటీ షో 'బిగ్ బాస్ 20' రెండో 'వీకెండ్ కా వార్' ఎపిసోడ్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. హోస్ట్ సల్మాన్ ఖాన్ మునుపెన్నడూ లేని విధంగా తీవ్ర ఆగ్రహంతో ఊగిపోయారు. తనపై గతంలో జరిగిన బాడీ షేమింగ్, ట్రోలింగ్‌ను గుర్తుచేసుకుంటూ బట్టలు విప్పేసి మరీ ట్రోలర్స్‌కు సవాల్ విసిరారు. ఇందుకు సంబంధించిన ప్రోమో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.వివరాల్లోకి వెళితే, ఈ వారం 'వీకెండ్ కా వార్' ఎపిసోడ్‌లో సల్మాన్ ఖాన్.. కంటెస్టెంట్ స్కాట్‌ఓపీ (తన్మయ్ సింగ్) ప్రవర్తనపై మండిపడ్డారు. గత వారం స్కాట్ మాట్లాడుతూ, "అతడు (సల్మాన్) నా గురించి తప్పుగా మాట్లాడితే అతడ్ని మీరు చూసుకోండి" అని తన యూట్యూబ్ కమ్యూనిటీని ఉద్దేశించి వ్యాఖ్యానించాడు. దీన్ని ప్రస్తావించిన సల్మాన్, "నేనేమైనా తప్పుగా మాట్లాడితే నన్ను చూసుకుంటారా?" అని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే తనకు ఎదురైన చేదు అనుభవాన్ని గుర్తుచేసుకుని ఆగ్రహం వెలిబుచ్చారు. గతంలో తాను బరువు పెరిగినప్పుడు సోషల్ మీడియాలో వచ్చిన కామెంట్లను సల్మాన్ ప్రస్తావించారు. ""భాయ్ మోటా హోగయా హై' (అన్నయ్య లావయ్యాడు) అంటూ ట్రోల్ చేశారు కదా.. ఇప్పుడు చేసుకోండి ట్రోలింగ్" అంటూ మండిపడ్డారు. అంతేకాకుండా, "యే లో.. కర్లో ట్రోలింగ్" అంటూ తన టోపీ, జాకెట్ తీసేశారు. అంతటితో ఆగకుండా, నల్ల టీ-షర్ట్ కూడా తీసే ప్రయత్నం చేశారు. సల్మాన్ ఈ స్థాయిలో ఫైర్ అవ్వడం చూసి కంటెస్టెంట్లు నిశ్చేష్టులయ్యారు.



## "ప్రతిసారి దేవుడే దిగిరావాలా?".. పవర్‌ఫుల్ గా సత్యదేవ్ 'సమవర్తి' టీజర్

విలక్షణ నటుడిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సత్యదేవ్, మరో ఇంటెన్స్ యాక్షన్ డ్రామాతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యాడు. ఆయన హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'సమవర్తి'. ఇటీవల విడుదలైన పోస్టర్లు సినిమాపై ఆసక్తిని పెంచగా, తాజాగా చిత్రబృందం విడుదల చేసిన అఫీషియల్ టీజర్ అంచనాలను మరింత పెంచేసింది. ఆద్యంతం గ్రిప్పింగ్‌గా సాగిన ఈ టీజర్, సినిమాపై భారీ హైప్ క్రియేట్ చేస్తోంది. హైదరాబాద్ లో జరిగిన ఓ ఈవెంట్ లో యూనిట్ సభ్యులు టీజర్ ను ఆవిష్కరించారు.టీజర్ ఆరంభంలో అడవి నేపథ్యంలోని సంభాషణలు, పులి-జింక ప్రస్తావన తో కథాంశంపై ఆసక్తిని రేకెత్తించారు. "ఆపద వచ్చిన ప్రతీసారి దేవుడే దిగిరావాలా?" అనే శక్తిమంతమైన ప్రశ్న తర్వాత, గిరిజనులను కాపాడే దైవ స్వరూపుడైన "మహదేవ్" పాత్రలో సత్యదేవ్ ఎంట్రీ గూస్‌బంప్స్ తెప్పిస్తుంది. రా, రస్టిక్ అవతార్‌లో ఆయన కనిపించిన తీరు, గంభీరమైన వాయిస్ ఓవర్ ఆకట్టుకున్నాయి.' 'నేను నొక్కాలి... తూటా తలలోకి వెళ్లాలి, అది నేను చూడాలి" వంటి పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమా ఏ స్థాయిలో ఉండబోతోందో తెలియజేస్తున్నాయి. విజువల్స్ చాలా సహజంగా, కథలోకి ప్రేక్షకుడిని తీసుకెళ్లేలా ఉన్నాయి. దీనికి తోడు, టీజర్ మూడ్‌కు తగ్గట్టుగా నేపథ్య సంగీతం కూడా అద్భుతంగా కుదిరింది.అజయ్ నాగ్ వి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా, రుద్ర పిక్చర్స్ బ్యానర్‌పై శివ చరణ్ రెడ్డి, పడమటి శశిధర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఇటీవల "రావు బహదూర్" చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న సత్యదేవ్, ఈసారి మాస్, యాక్షన్ ప్రేక్షకులను అలరించేందుకు గట్టి ప్రయత్నమే చేస్తున్నాడు. "ఈసారి అస్సలు మిస్ అవ్వదు" అంటూ టీజర్ చివర్లో వచ్చే డైలాగ్, సినిమా విజయంపై చిత్రబృందం నమ్మకాన్ని స్పష్టం చేస్తోంది. ఈ చిత్రాన్ని త్వరలోనే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.




PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.